విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 17 ఆగస్టు 2025   8 పేజీలు

బడుగుల అభ్యున్నతికి పోరాడిన గౌతు లచ్చన్న

రాష్ట్ర గృహ నిర్మాణ,
సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర-నూజివీడు: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ గౌతు లచ్చన్న పోరాడారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా నూజివీడు పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు సెంటర్లోని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే కితాబు పొందిన రెండో వ్యక్తి గౌతు లచ్చన్న అని గుర్తు చేశారు. గౌతు లచ్చన్న చేసిన సేవలు పోరాటాలు, కార్యదక్షతకు ప్రజలు ఇచ్చిన కితాబు సర్దార్ అని తెలిపారు. నేతాజీ వంటి జాతీయ నాయకులతో ▶మిగతా 2లో..

లక్షల ఖర్చు...కానరాని ఫలితం

- కొవ్వూరులో పడకేసిన పారిశుధ్యం
- డ్రైన్లలో సిల్టు తీయడానికి ఏటా రూ. 30 లక్షల ప్రజాధనం వృథా

విశాలాంధ్ర-కొవ్వూరు : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరు పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా పడకేసింది. ఒకవైపు మున్సిపాలిటీకి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం, మరొకవైపు పారిశుధ్య సిబ్బంది విధులకు సరిగా హాజరు కాకపోవటం, వారిపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్య వైఖరి అనుసరించడంతో పట్టణంలో ఈ పరిస్థితులు దాపురించాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వర్షాకాలం వచ్చి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా ఇవేమీ పాలకులకు గానీ అధికారులకు గానీ పట్టడం లేదు. ప్రజలకు మౌలిక సదుపాయాలైన చెత్త సేకరణ, డ్రైన్లను శుభ్రపరచడంలోనూ, వీధిలైట్ల నిర్వహణలోనూ పూర్తిగా విఫలమైందన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మరొక వైపు లక్షలాది రూపాయలను మున్సిపాలిటీకి

ట్యాక్సులుగా చెల్లిస్తున్నా అందు కు తగ్గ సేవలు మున్సిపాలిటీ నుంచి అందటం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలిస్తే గాని ఈ వ్యవస్థ బాగుపడదు అన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మేజర్ డ్రైన్లలో సిల్టు తీతకు ఏటా రూ.30 లక్షలు ప్రజాధనం వృథా అవుతోంది. పారిశుధ్య సిబ్బంది పట్టణంలోని మేజర్ డ్రైన్లలో కనీసం వారానికి ఒకసారి అయినా శుభ్రం చేసినట్లయితే ప్రజా ధనం వృథా కాదుకదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. చిన్న డ్రైన్ల విషయానికొస్తే ప్రతిరోజు సిల్టును పారిశుధ్య సిబ్బంది తీయకపోవడంతో డ్రైన్లు నిండిపోయి వర్షపు నీరు అందులోకి చేరి ఆయా రహదారులపై పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఆయా రహదారులపై మురికి చేరడంతో వాహన దారులు జారిపడుతున్నారు. మరొకవైపు రాత్రి వేళ వీధిలైట్లు వెలగకపోవడంతో ఈ ప్రమాదాలు అధికమయ్యాయి. చెత్తా చెదారం విషయంలో కొవ్వూరు మున్సిపాలిటీకి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో సమస్యలు నానాటికి పేరుకుపోతు న్నాయి. ఉన్న కమిషనర్ బదిలీ కావడంతో ఇన్ చార్జి కమిషనర్‌గా ఏఈ సందీప్‌ను నియమించారు. ఆయన ప్రస్తుతం కార్యాలయ బాధ్యతలను చూస్తున్నారు. ఆయన అసిస్టెంట్ ఇంజనీరింగ్ విభాగంను కూడా ▶మిగతా 2లో..

గౌతు లచ్చన్న మార్గం అనుసరణీయం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న మార్గం అందరికీ అనుసరణీయం అన్నారు. ఆయన పేద కుటుంబంలో జన్మించి

జీవితాంతం అంటరానితనం నిర్మూలనకు పోరాడారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి అన్నారు. సర్దార్ వల్లభాయి పటేల్ తరువాత సర్దార్ అనే పిలవబడే ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు. స్వాతంత్ర సమరయోధుడిగా బడుగు, బలహీన వర్గాల రైతు కార్మిక నాయకుడిగా అనేక ఉద్యమాలను సాగించారని అన్నారు. రాజకీయ జీవితంలో మంత్రిగా పనిచేసి అందించిన సేవలు ప్రజల హృదయాలలో స్థిర స్థాయికి నిలిచి ఉంటాయని కలెక్టర్ అన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరం, రాజకీయంలో కీలకంగా వ్యవహరించిన గౌతు లచ్చన్న జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, వసతి గృహాల అధికారులు సి.హెచ్ మోహనరావు, కె.శ్రీనివాస్, గీత, జయంతి, రాజేశ్వరి, జి.ప్రసాద్, కె.సాగర్, కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ...గందరగోళం

- విలీన మండలాలకు చుక్కెదురు
- మహిళలకు వర్తించని స్త్రీ శక్తి పథకం
- ఇంటర్ స్టేట్ ఆర్టీసీ సర్వీసుగా గుర్తింపు
- పథకం వర్తింపజేయాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్ర విభజనతో ఏపీలోకి విలీనమైన కుక్కునూరు, వేలేరుపాడులకు చుక్కెదు రైంది. మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై గందరగోళం నెలకొంది.కూటమి ప్రభుత్వం ఇచ్చిన ▶మిగతా 2లో..

త్యాగధనుడు గౌతు లచ్చన్న

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ▶మిగతా 2లో..

అణగారిన వర్గాల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న

మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి, తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎక్కడా రాజీ పడకుండా బడుగు, బలహీన వర్గాలకు దిక్సూచిగా నిలిచిన సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తిదాయకమైన జీవిత చరిత్రను భావి తరాలకు తెలపాల్సిన అవసరముందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కీ.శే. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలను పురస్కరించుకుని శనివారం రాజమహేంద్రవరం వై జంక్షన్ లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి మంత్రి కందుల దుర్గేష్ నివాళులర్పించారు.తెలుగు జాతికి గర్వకారణమైన సర్దార్ గౌతు లచ్చన్న లాంటి

గొప్ప వ్యక్తి జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. గౌతు లచ్చన్న ఆశయాలు ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్న రాజమండ్రి గౌడ, శెట్టి బలిజ సంఘానికి అభినందనలు తెలిపారు. గౌతు లచ్చన్న పేరు వింటేనే ఉద్యమానికి నిలువెత్తు రూపంగా నిలుస్తారని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. భారతదేశ రాజకీయాల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ బిరుదు పొందిన మహనీయులు అని గుర్తు ▶మిగతా 2లో..

ప్రతి విద్యార్థి మెరిట్ స్టూడెంట్‌గా ఎదగాలి

ఆర్‌వీఎస్ రాజు

విశాలాంధ్ర - గణపవరం: ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులు మెరిట్ స్టూడెంట్లుగా ఎదగాలని రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ గణపవరం శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం అధ్యక్షులు రుద్రరాజు

వేంకట సూర్యనారాయణ రాజు(ఆర్ వి ఎస్ రాజు) అన్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను వర్తక సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా చేసే జాతీయ కార్యక్రమాలలో భాగంగా వార్షికంగా విద్య ప్రోత్సాహక కార్యక్రమం గా పదవ తరగతి ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైన బాలుర, బాలికల హైస్కూల్లో విద్యార్థులకు , ఐదవ తరగతి ఫస్ట్ క్లాస్ లో పాస్ అయిన విద్యార్థులకు ప్రోత్సాహంగా ఆర్థిక సహకారంగా నగదు సర్టిఫికెట్ ఆర్థిక సహకారంతో పుస్తకాలు పిల్లలకు అందించారు. ఆర్ వి ఎస్ రాజు మాట్లాడుతూ ఎప్పుడు సమాజ సేవలో ముందు ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ వంకాయ రామారావు, సెక్రటరీ నడిపిల్లి రాంపండు, మాస్టారు శర్మ, పిల్లలు మహిళలు పాల్గొన్నారు.

ఆపదలో పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్

విశాలాంధ్ర -ముసునూరు: పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం కూటమి ప్రభుత్వం వేల కోట్ల కేటాయిస్తుందని, ఆపత్కాలంలో పేద ప్రజల మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో తోడ్పాటు అందిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కె.నాగబాబు అనారోగ్య కారణం చేత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో కుటుంబ సభ్యులు అతనికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థిక చేయూత కోసం మంత్రి కొలుసు పార్థసారధిని ఆశ్రయించారు. ఆయన వెంటనే స్పందించి కేవలం ఒక గంట వ్యవధిలోనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 1,50,000 ఎల్‌ఓసి మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు గద్దె రఘు, జనసేన పార్టీ నాయకులు పాశం నాగబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శృంగవృక్షంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు, సాలె పురుగు లాంటి నరాలు, పాదం వేళ్ళల్లో గ్యాంగ్రిన్ రావడం,కాళ్ళల్లో, పాదాల్లో నలుపు రావడం, ఉబ్బిన నరాలు,సుగర్ వ్యాధిగ్రస్తులకు కాళ్ళ పై పుండ్లు, వేళ్ళు నల్లబడటం, బోదకాలు చికిత్స, ఆకస్మికంగా తగ్గిన రక్త ప్రసరణను పునరుద్ధరించుట, కిడ్నీ రోగుల డయాలసిస్ ఏవీ ఫిస్టులా, కెరోటిడ్ డిసీజ్, వాస్కులర్ మాల్ ఫార్మేషన్స్ కు చికిత్స, ప్రమాదాల్లో గాయపడిన రక్తనాళాలకు చికిత్స లకు ఉచితంగా వైద్యం చేస్తారని అన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఆసియన్ వాస్కులర్ హాస్పిటల్ వారు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

దస్తావేజు పోయినది

కనుమూరి సాయి కార్తీక్ సూర్యనారాయణరాజు S/o. నరసింహరాజు,డోర్‌నెం.1-169, పెన్మెత్సవారి వీధి, గొల్లలకోడేరు(గా), పాలకోడేరు (మం), ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్. మా అమ్మమ్మ బుద్ధరాజు వెంకట సుబ్బాయమ్మ(లేటు) W/o.సుబ్బరాజు (లేటు) యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం.3115/1971 ను జిరాక్స్ తీయు నిమిత్తం ది.14.08.2025వ తేది ఉదయం 10 గం॥లకు మా ఇంటి వద్దనుండి గొల్లలకోడేరు సెంటరుకు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో సదరు ఒరిజినల్ దస్తావేజు పోయినది. ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అంద చేయగలరు.

సెల్ నెం: 91826 81514

గందరగోళం

(1వ పేజీ తరువాయి)

హామీల్లో సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రెండు రోజుల క్రితం మహిళలకు స్త్రీ శక్తి పథకం (ఉచిత బస్సు ప్రయాణం) ఎంతో ఆర్భాటంగా ప్రవేశ పెట్టారు. కుక్కునూరు, వేలేరుపాడు మండ లాల మహిళలకు ఉచిత బస్సు ప్రయా ణంపై నిరాశ ఎదురైంది. అటు తెలంగాణ, ఇటు ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దుల్లో ఈ రెండు మండలాలు ఉండటంతో ఇటుగా ప్రయాణం చేసే ఆర్టీసీ సర్వీసులకు (ఇంటర్ స్టేట్ గుర్తింపు) స్త్రీ శక్తి పథకంపై కోత పడినట్టు తెలుస్తోంది. దీంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

స్త్రీ శక్తి పథకం వర్తింపజేయాలి : సీపీఐ

విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాలకు చెందిన మహిళలకు స్త్రీ శక్తి పథకం వర్తింపజేయాలని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య కోరారు.రాష్ట్ర విభజన తరువాత పోలవరం ప్రాజెక్టు ముంపు సాకుతో ఇక్కడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు.

పథకం ద్వారా ఐదు బస్సు సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిం చినా విలీన మండలాలకు ఆ పథకం వర్తించకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు.

అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలకు నోచుకోక వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, సహాయ కార్యదర్శి కురాకుల బాబురావు, మండల కార్యవర్గ సభ్యులు మైసాక్షి వెంకటాచారి, పల్లెల భిక్షం ఉన్నారు.

త్యాగధనుడు గౌతు లచ్చన్న

(1వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అధికారులతో కలిసి కాకినాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం గౌతు లచ్చన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో చురుకుగా పాల్గొని శ్రీకాకుళం, విజయనగరం ఇతర ప్రాంతాల ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. వెనుకబడిన వర్గాల ప్రజలను చదువుకునేలా ప్రోత్సహించేందుకు హాస్టళ్ళు, పాఠశాలలు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.

భావితరాలకు సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం. లిల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, సహాయ బీసీ సంక్షేమాధికారి పి.రామక్రిష్ణ, డబ్ల్యూహెచ్‌వోలు బహదూర్, వై. కల్పన, కారపు సూర్య శివ ప్రసాద్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశాజ్యోతి గౌతు లచ్చన్న

(1వ పేజీ తరువాయి)

చేశారు. 96 సంవత్సరాల తన జీవిత కాలంలో రాష్ట్ర ప్రజలను ఎంతగానో ప్రభావితం చేశారని నాడు పలాసలో ఒక్కడే అఖిల భారత కిసాన్ సభను నిర్వహించి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. మెట్రిక్యులేషన్ చదువుతున్న సమయంలో మహాత్మా గాంధీజీ పిలుపుమేరకు ఉద్యమంలోకి అడుగుపెట్టారని, అనేక పర్యాయాలు ప్రజల కోసం జైలుకు వెళ్లారని, అలాంటి ఎందరో గొప్ప వ్యక్తుల త్యాగనిరతి వల్లే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

కానరాని ఫలితం

(1వ పేజీ తరువాయి)

చూడడంతో పూర్తిస్థాయిలో పట్టణంలోని పారిశుధ్య పరిస్థితి లపై దృష్టి పెట్టలేకపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

ఒకవైపు ఆర్డీవో మరొకవైపు ఎమ్మెల్యే కొవ్వూరులో ఉంటున్నా అధికారులు ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది.

కొవ్వూరు రాని సీఎం చంద్రబాబు
రూ. 5 లక్షలు వృథా

ఈనెల 1వ తేదీన సీఎం చంద్రబాబు పెన్షన్లు అందజేయడానికి కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలంలోని మలకపల్లికి విచ్చేశారు.

కొవ్వూరు మండలం కాపవరం పంచాయతీ పరిధిలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయ ఆవరణలో హెలిప్యాడ్ ను ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు అమరావతి నుంచి నేరుగా హెలికాప్టర్ ద్వారా కాపవరంలోని హెలిప్యాడ్ కు చేరుకుని మలకపల్లి వెళ్లారు. ఆయన కొవ్వూరు వస్తారని ఎక్కడా రూట్ మ్యాప్‌లో లేదు.

కొవ్వూరు మున్సిపల్ పాలకులు, అధికారులు కొవ్వూరు పట్టణ ప్రారంభం టోల్‌గేట్ దగ్గర నుంచి గోదావరిపై నిర్మించిన నాలుగో వంతెన గ్రామర్ ఇండియా బ్రిడ్జి వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పేరిట నిర్వహించి రూ.5 లక్షలను ఇటీవల జరిగిన కౌన్సిల్ ఎజెండాలో పొందుపరిచారు. చంద్రబాబు కొవ్వూరు రాలేదు కదా మరి ఈ స్పెషల్ డ్రైవ్ ఏంటి, ఐదు లక్షలు ఏ విధంగా ఖర్చుచేశారని కౌన్సిలర్లు అడగలేదు, అధికారులు సమాధానం చెప్పలేదు. ఇటువంటి పరిణామాల్లో కొవ్వూరు పట్టణ ప్రజల సొమ్ము వృధా కాకుండా సద్వినియోగించాలని పన్నులు చెల్లించిన ప్రజలు కోరుతున్నారు.

పోరాడిన గౌతులచ్చన్న

(1వ పేజీ తరువాయి)

పని చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొని ఎన్నో సార్లు జైలు జీవితం గడిపారని తెలిపారు. ప్రకాశం పంతులు ప్రభుత్వంలో మద్యపాన నిషేధంపై అవిశ్వాస తీర్మానం పెట్టిన నాయకుడన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వంలో అత్యవసర పరిస్థితిలో స్వేచ్ఛ కోసం పోరాడిన వ్యక్తి లచ్చన్న అని తెలిపారు. ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆంధ్రరాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తనదైన ముద్రవేశారని కొనియాడారు.

విద్యార్థులకు మానసిక ఉల్లాసం ప్రధానం

విశాలాంధ్ర-లింగపాలెం: విద్యార్థులు విజ్ఞానవంతులుగా తయారవ్వటానికి మానసిక ఉల్లాసం ప్రధానమని మండల విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. ధర్మాజీగూడెంలోని శ్రీ సాయి (క్రిసాలిస్) ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాలలో ఈయన ముఖ్య

అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణాష్టమి పండుగలు వరుసగా రావడం పిల్లలకు ఎంతో ఆనందాన్ని కలిగించేదని అన్నారు. ఈపండుగల విశిష్టత,చరిత్రను విద్యార్థులకు ఉల్లాసం కలిగించే రీతిలో తెలియచెప్పాలని తెలిపారు. విద్యార్థులు మానసిక ఉల్లాసంగా ఉన్నప్పుడు క్రమశిక్షణ అలవడి మంచి పౌరులుగా సమాజంలో గుర్తింపు పొందుతారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉల్లాసపరిచారు. పాఠశాల డైరెక్టర్లు తాడేపల్లి క్రాంతికుమార్, బట్టు విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

అలరించిన గిటారుతో వందేమాతరం గీతం

విశాలాంధ్ర -ఏలూరు: భారత 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో నారాయణ జూనియర్ కాలేజ్ ఇంటర్మీడియట్ మొదటి

సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రాజనందిని గిటార్తో వందేమాతర గీతం ప్రదర్శించింది. సదరు కార్యక్రమంలో భాగంగా ఆమె జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, మంత్రి కె. పార్థసారథి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకోవడం చాలా ఆనందంగా ఉందని నారాయణ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, బైపిసి బ్లాక్, కె.మురళీకృష్ణ తెలిపారు. తమ కాలేజీ విద్యార్థిని ఈ ఘనత సాధించడం తమకెంత ఆనందదాయకమని ప్రిన్సిపల్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర -నూజివీడు :నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వంగేటి ప్రతాప్ గత నెల 21వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబానికి నియోజకవర్గ

తెలుగుదేశం నాయకులు మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందచేసారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ప్రతాప్ భార్య, ముగ్గురు పిల్లలకు రు.50,000 నగదు అందచేసారు. ప్రతాప్ కుటుంబం పరిస్థితి మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకు వెళ్ళి పిల్లలను హాస్టల్‌లో చర్పించే విధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.ప్రతాప్ కుటుంబాన్ని అన్నివేళలా అండగా ఉంటామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర -భీమవరం: పెదగరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శ్రీరామపురం, పెదగరువు ఫీడర్లకు సంబంధించిన పనులు, చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పెదగరువు, రాజులగరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం, గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- చింతలపూడి: శ్రమజీవుల సమరశంఖారావం పేరుతో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో జరుగుతున్నా

యని 23వ తేదీ జరిగే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు కావస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను', రైతాంగానికి అమలు చేస్తానన్న స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయలేదన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ప్రైవేటీకరణ విధానాలను అవలంబిస్తున్నదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేస్తూ వేలాదిమంది కార్మికుల ఉపాధిని కాలరాస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కంచర్ల గురవయ్య, దంతా కృష్ణ, ఎస్కే కాలేశా, ఎం. అలెగ్జాండర్, కొవ్వూరు కృష్ణ, ఇస్తరాకుల వెంకటేశ్వరరావు, తాడిగడప మాణిక్యాలరావు, గంధం అంజమ్మ, ఎం.లక్ష్మణరావు, తక్కలపాటి ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు పశువుల రైతులు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: వర్షాలు, వరదలకు పశువులకు ప్రాణ నష్టం వాటిల్లకుండా పశువుల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి కె. కోటేశ్వర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాలకు రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించడం ద్వారా పశువులకు ఎటు

వంటి హాని జరగకుండా కాపాడ వచ్చునని ఆయన తెలిపారు. పశువుల షెడ్లు గాలివానలకు కూలి పోకుండా ముందుగానే మరమ్మతులు చేయించాలని అన్నారు. పశువులకు నట్టలనివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తెలిపారు. పశువులను విద్యుత్తు తీగలు, స్తంభాలకు దూరంగా ఉంచాలని, అవసరాలకు అనుగుణంగా దాణా,మేతను నిల్వ ఉంచుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని సూచనలు సలహాలు కోసం పశు వైద్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పీడిత ప్రజల అభ్యున్నతికి గౌతు లచ్చన్న కృషి ఎనలేనిది

విశాలాంధ్ర - ముదినేపల్లి : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, పీడిత ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్న చిరస్మరణీయులని వక్తలు పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ముదినేపల్లి బస్టాండ్ వద్ద , గురజ రోడ్డు సెంటర్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ

సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సర్దార్ గౌతు లచ్చన్న ఐదు సార్లు శాసనసభ్యునిగా, ఒక విడత ఎమ్మెల్సీ, మంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవలందించారని నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, దావు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో మెట్ట ప్రాంత రైతుల ఆనందం

అలుగులు పడుతున్న చెరువులు

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్ట ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండ టంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లింగపాలెం మండలంలో జులైలో 254 మి.మీ. పడాల్సి ఉండగా 174.2 మి.మీ. మాత్రమే వర్షం పడింది. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నెలలోమాత్రం ఇప్పటికీ వర్షపాతం ఆశాజనకంగా ఉండటంతో రైతులలో ఆనందం వ్యక్తం అవుతున్నది. ఆగస్టులో 239 మి.మీ. వర్షం పడాల్సి ఉండగా ఇప్పటికి 144 మి.మీ. వర్షం పడింది. వరుసగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల చెరువుల్లోకి నీరు చేరడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు చెరువుల అలుగులనుంచి నీరు ప్రవహిస్తున్నది. భోగోలులోని అక్కిచెట్టు చెరువు, అయ్యపరాజు గూడెంలోని తాళ్ళచెరువు, కొణిజర్లలోని కామరాజు చెరువులకు అలుగులు పడ్డాయి. గుండేరు వాగు ఒక మోస్తరుగా ప్రవహిస్తున్నది. మండలంలో ఉన్న చిన్న చెరువులన్నీ నీటితో నిండాయి.పూర్తిస్థాయి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు పడుతున్న వర్షాలతో సంతృప్తి చెందుతున్నారు. పంటలకు ఆశాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. వర్షాలు ఇంకా కొన్ని రోజులు పడతాయని హెచ్చరికలు ఉండటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. లింగపాలెం తహసీల్దార్ నజీమ్, ఉపతహసీల్దార్ ప్రసాద్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగబాబు గ్రామాలలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకు న్నారు. ఎప్పటికప్పుడు వివరాలు అందిస్తూ అప్రమత్తంగా ఉండాలని రెవిన్యూ సిబ్బందిని వీరు ఆదేశించారు.తమ్మిలేరు కాలువ పక్కన ఉన్న కొన్నిజర్లలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తే తీసుకోవాల్సిన చర్యలపై ముందస్తుగానే ప్రణాళిక చేపట్టారు.

పెండింగు క్లెయిమ్‌లను పరిష్కరించాలని కోరుతూ

భవన నిర్మాణ కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం

విశాలాంధ్ర-భీమవరం: భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డులో పెండింగులో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించా లని దువ్వ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు జాన పాముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర భవననిర్మాణ కార్మికసంఘం ఇచ్చిన పిలుపు మేరకు వెల్ఫేర్ బోర్డులో పెండింగులో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు పోస్టుకార్డులు పంపించే కార్యక్ర మాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టారు. అందులో భాగంగా దువ్వ భవననిర్మాణ కార్మిక సంఘం సభ్యులు నాలుగు వందల పోస్టు కార్డులను గత మూడు రోజులుగా పోస్టు చేశారు.ఈ సందర్భంగా శనివారం యూనియన్ అధ్యక్షులు జానపాముల శ్రీనివాస్ కార్మికులతో మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో గత ఆరు సంవత్సరాల నాలుగు నెలలుగా పెండింగులో ఉన్న క్లెయిమ్‌లన్నింటినీ వెంటనే పరిష్కరించాలని

కోరారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయా లన్నారు. భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పటిష్టం చేసి, సభ్యత్వ నమోదును పూర్తిగా ఆన్‌లైన్ విధానం లో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో దువ్వ యూనియన్ కార్యదర్శి తాళాల రామకృష్ణ, సభ్యులు అడబాల నరసింహా, కాకిలేటి దుర్గారావు, షేక్ లాల్, కంచుమర్తి నవీన్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

జిఆర్‌సిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర- ఉంగుటూరు : గుణ్ణం రామచంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ (జిఆర్ సి ఆర్) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిఆర్‌సిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు గ్రామాలలో పలు సేవా కార్యక్రమాలు చేసారు. తొలుత దివంగత సర్పంచి గుణ్ణం రామచంద్రరావు విగ్రహానికి పలువురు పూలమాలవేసి నివాళు లర్పించారు. గుణ్ణం సురేష్ (రిషి) జన్మదినం సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణపురం పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ పారిశుధ్య, సిబ్బందికి దుస్తులు, ఆహారం, ఆశా కార్యకర్తలకు చీరలు, ఆహారం అందజేశారు. చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు అందజేశారు. 50 మంది ఎయిడ్స్ పేషెంట్లకు నెలకు సరిపడా ప్రోటీన్ ఫుడ్, ఉంగుటూరు అనాథాశ్రమం పిల్లలకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిద్ద అలకనంద శ్రీనివాస్, గుణ్ణం సురేష్ రిషి, నల్లా ఆనందకుమార్, వెజ్జు సుబ్బారావు, పాతూరి సత్యనారాయణ, గాది రమణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ జీఎస్టీ అధికారిగా వర్ధనపు రాజేష్

విశాలాంధ్ర -భీమవరం: కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో వాణిజ్య పన్నుల శాఖాధికారి వర్ధనపు రాజేష్ కుమార్ జిల్లా ఉత్తమ జీఎస్టీ

అధికారిగా మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. జీఎస్టీ సహాయ కమిషనర్ కేదారేశ్వరరావు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, సిబ్బంది రాజేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జస్మిత

విశాలాంధ్ర- చింతలపూడి: రాష్ట్ర స్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీలకు నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎస్. జస్మిత ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. హేమలత తెలి పారు. ఈ సంద

ర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను సత్కరించి వారికి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా హేమలత మాట్లాడుతూ ఈనెల 10న ఏలూరు లోని ఓల్డేజ్ హోమ్ లో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీల్లో ఎస్.జస్మిత ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిందని తెలిపారు. ఈనెల 22న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అధికారులు ఆమెను ఎంపిక చేశారని తెలిపారు. మరోవిద్యార్థిని అమలారాణి ట్రెడిషనల్ జూనియర్ స్థాయి యోగా పోటీల్లో మూడోస్థానంలో నిలిచి మెడల్ సాధించిందన్నారు. యోగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన పిఇటి బాలభారతిని ప్రిన్సిపాల్ తో పాటు పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసి కమిటీ సభ్యులు అభినందించారు. వారిని అభినందించిన వారిలో ఎటిపి శ్రీదివ్య, బాలభారతి, ఎస్ఎంసి చైర్మన్ నాగరాజు, సభ్యులు లలిత, లక్ష్మీనారాయణ, పరమేష్, నాగరాణి, లావణ్య, ప్రశాంతి, నాగేశ్వరి, శిరీష, సతీష్ ఉన్నారు.

జిల్లా ఉత్తమ పశు వైద్యాధికారిగా కోటేశ్వరరావు

విశాలాంధ్ర-టి నరసాపురం: ఏలూరులోని జిల్లా కలెక్టరేట్ లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా టి నరసా పురం పశు వైద్యాధికారి డాక్టర్ కె. కోటేశ్వరరావు జిల్లా ఉత్తమ పశు వైద్యాధికారి

అవార్డు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున అందించే ఉత్తమ అవార్డు డాక్టర్ కోటేశ్వరరావు కు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఈపీఎఫ్ పెన్షనర్ల జిల్లా సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ 95 (ఈపీఎఫ్)పెన్షన్ దార్ల సమస్యలు పరిష్కరించాలని, కనీస పెన్షన్ రు.9000 ఇవ్వాలని కోరుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు భీమవరం యుటిఎఫ్ కార్యాలయంలో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎర్ర అజయ్ కుమార్, జిల్లా కన్వీనర్ టీగంగరాజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీఎఫ్ 95 పెన్షన్ దారులు అసమర్ధ విధానాలతో చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి పెన్షన్ రివ్యూ చేస్తామని గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చినా అమలు జరగలేదని వారు విచారం వ్యక్తం చేశారు. పెన్షన్ దారుల సమస్యలపై చర్చించి రాబోయే కాలంలో తీసుకునే కార్యాచరణపై ఈ సదస్సులో చర్చిస్తామని, సదస్సుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు హాజరవుతారని తెలిపారు.

జంగంగూడెం సొసైటీ అధ్యక్షునిగా వంకాయల హరిబాబు

విశాలాంధ్ర -నూజివీడు :నూజివీడు మండలం జంగంగూడెం సహకార సంఘం అధ్యక్షునిగా తెలుగుదేశం నాయకులు వంకాయల హరి బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హరిబాబుతో పాటు పాలకవర్గ సభ్యులుగా

వల్లభనేని నాగేశ్వరరావు, పొత్తూరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ పరిధిలోని దేవర గుంట, జంగం గూడెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు ప్రదర్శన నిర్వహించారు. సొసైటీ అధ్యక్షునిగా ఎంపికైన హరిబాబును, పాలకవర్గ సభ్యులను జంగంగూడెం సర్పంచ్ పొట్లూరి అంజని, తెలుగుదేశం నాయకులు పొట్లూరు అశోక్ లతో పాటు పలువురు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏపిగుంట పంచాయతీలోని బచ్చులేటిగూడెం గ్రామానికి చెందిన పొడియం రవి (35)కి వివాహమై ఇద్దరు కుమారులున్నారు. భార్య భర్తల మధ్య గొడవల కారణంగా రవి భార్య పుట్లేపు గ్రామంలో పుట్టింటి వద్ద ఉంటున్నది. రవి అప్పుడప్పుడు భార్య దగ్గరకు వెళ్లి కొద్ది రోజులు వుండి ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన ఉదయం మోటారు సైకిల్ పై ఇంటి వద్ద నుండి వెళ్ళి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ళ వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. తండ్రి పొడియం నాగేశ్వరరావు ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

విశాలాంధ్ర - నరసాపురం : రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలం లోని చిట్టవరంలో పంట పొలాల వద్ద

మహిళలను కలుసుకుని, వారితో ఆత్మీయంగా మాట్లాడారు. వారి సమస్యలు, అవసరాలు తెలుసుకుని, రైతాంగానికి ప్రభుత్వం అందించే సాయం, పథకాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో విమాన ఇంధనంగా పామాయిల్ : ఎంపీ మహేష్

విశాలాంధ్ర - ఏలూరు : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు దెందులూరు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా దెందులూరు మండలం, చల్ల చింతలపూడి గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్

కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తనకు శ్రీకృష్ణాష్టమి అంటే ఇష్టమని, ఈసారి ఇక్కడ గ్రామస్థులతో కలిసి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గిట్టుబాటు ధర కోసం ఇబ్బందులు పడుతున్న పామాయిల్ రైతులకు శుభవార్త చెప్పారు. విమాన ఇంధనంలో పామాయిల్ కలిపి వాడే విధంగా శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు విజయవంతం అయ్యాయని, వచ్చే 10-12 ఏళ్లలో విమాన ఇంధనంగా పామాయిల్ వాడే పరిస్థితి వస్తే ఆయిల్ పామ్ రైతుల కష్టాలు తీరిపోతాయని చెప్పారు. ఈ కార్యక్ర మంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో పాటు మండల టీడీపీ కార్యదర్శి సత్యనారాయణ, జనసేన, బీజేపీ నేతలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జీవితం ఆదర్శనీయం

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీజీ, వి.వి.గిరి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో నాయకులతో కలిసి సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని, జైలు జీవితాన్ని అనుభవించారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలు ఆయనకు సర్దార్ బిరుదునిచ్చారన్నారు. తన 21వ ఏట గాంధీజీ పిలుపుమేరకు స్వాతంత్ర్య ఉద్య మంలో చేరారని, మహాత్మాగాంధీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహం,

విదేశీ వస్తు బహిష్కరణ, క్విట్ ఇండియా ఉద్యమం, తదితర ఉద్యమాలలో గాంధీజీతో కలిసి నడిచారన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి గౌతు లచ్చన్న అని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, సూపరింటెండెంట్ చల్లన్న దొర, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు టి. వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, వసతిగృహ సంక్షేమ అధికారులు, ప్రభుత్వులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-పాలకోడేరు : పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ 27వ మహాసభలు ఈనెల 19,20 తేదీల్లో తణుకులో జరుగునున్న సందర్భంగా పాలకోడేరు మండలం వేండ్ర గ్రామంలో మహా

సభకు సంబంధించిన కరపత్రాలను స్థానిక సీపీఐ నేతలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా మహాసభలు జయప్రదం కావాలన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా జన సమీకరణ చేసి ప్రజలను ఈ మహాసభలలో భాగస్వాములను చేయాలని కోరారు. అనంతరం నేతలు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకోడేరు మండల సీపీఐ కార్యదర్శి ఎం. లక్ష్మీ గణపతి, మహిళా సమాఖ్య నాయకురాలు ఎం. విజయలక్ష్మి, సీపీఐ నాయకులు అరటికట్ల నాగేశ్వరరావు, కడలి బాలచంద్రకుమార్, అరటికట్ల చిన్న, సిహెచ్ నాగేశ్వరరావు, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర -భీమవరం: హరేరామ హరేకృష్ణ నామమే సుఖాల రుగ్మతలకు పరిష్కారమని కలెక్టర్ చదలవాడ నాగరాణి, హరేరామ మూమెంట్ అక్షయ పాత్ర అధ్యక్షులు వంశీధర్ దాసు అన్నారు. భీమవరం ఆనంద పంక్షన్ హాల్లో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ అధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుక లను కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా

వారు మాట్లాడుతూ భగవద్గీత మానవుని మనుగడకు మార్గదర్శకమని అన్నారు. రాగద్వేషాలకు అతీతంగా జీవనం సాగించినప్పుడే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని అన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు అన్నపూర్ణమ్మ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆనందరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ్ రాజు, విజయవాడ గోకుల క్షేత్రం సభ్యులు మహత్వ దాసు మాట్లాడుతూ విజయవాడ హరేకృష్ణ గోకుల క్షేత్రం వారి సమక్షంలో వేడుకలను కోలాహలంగా నిర్వహించామన్నారు. వేడుకల కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, దాయన చంద్రాజి, పైడిరాజు మాట్లాడుతూ బాలలకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో శ్రీకృష్ణుని వేషధారణలు, చిత్రలేఖనం, స్వామి కీర్తనలు, క్లాసికల్ డాన్స్, శ్లోకాలు, పెయింటింగ్ పోటీలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.గోపాలరాజు, డాక్టర్ బి.వెంకటేశ్వర రావు, డాక్టర్ సాయి రాజు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూజివీడు : కృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని రావిచెర్ల గ్రామంలో త్రైత సిద్ధాంత ఆదికర్త ప్రబోధానంద యోగీశ్వరుల సారథ్యంలో తెలుగుదేశం నాయకులు కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభించారు. ఈ వేడుకలు 11 రోజులపాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో యాదవ సంఘాల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అన్న సంతర్పణ చేపట్టారు. పలు ప్రాంతాల్లో జన్మాష్టమి వేడుకల్లో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గణపవరం చిన్న రామచంద్రపురం (ఇందిరమ్మ కాలనీ)లో వేంచేసియున్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణాలయం బృందావనంలో శనివారం ఆలయ మంతా భక్తులతో కిటకిటలాడింది స్వామివారిని పెద్ద ఎత్తున భక్తులు సందర్శించి

తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఉదయం గోపూజ, సాయంత్రం ఉట్టికొట్టడం, భరతనాట్యం కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు కృష్ణాలయం చైర్మన్ బైరబోయిన మాల్యాద్రి యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బోయిన నాగేశ్వరరావు, కోశాధికారి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ శేగు సుబ్రహ్మణ్యం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేణుమాధవుడు లోకానికి గీతను బోధించి ప్రతి

ఒక్కరికి మార్గం చూపారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ , సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ , బొమ్మినంపాడు మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు ఎర్ర శ్రీరాములు, గ్రామస్తులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో నిర్వాహకులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శని, ఆదివారాలలో ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. మొదటి రోజైన శనివారం నిర్వహించిన వేడుకలలో ఉండి శాసనసభ్యులు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. ఆయనకు నిర్వాహ కులు ఘనంగా స్వాగతం పలికి శ్రీకృష్ణుని ప్రతిమ బహూకరిం చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రేతాయుగంలో దుష్టులను సంహరించి సకల జనులను కాపాడడానికి శ్రీ మహా విష్ణువు శ్రీకృష్ణునిగా జన్మించాడని తెలిపారు. లోక కళ్యాణం కోసం అవతరించిన శ్రీకృష్ణ జన్మ వేడుకలను అనాదిగా జరుపుకోవడం మన ఆచారమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన ధర్మం బాటలో నడవాలని కోరారు. అనంతరం శ్రీకృష్ణ మందిరానికి వెళ్లే రోడ్డును పరిశీలించి ఇరుకుగా ఉన్న రోడ్డును విస్తరించే దిశగా రైతులతో సంప్రదించి త్వరలోనే ఒక పరిష్కారం చూపుతానన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు, ఉండి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కమ్మిలి రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు కామన రాంబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిదిండి: శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గ్రామాలలో ఘనంగా జరిగాయి. శనివారం మండలంలోని కలిదిండి, కోరుకొల్లు, ఆరుతెగల పాడు, కొండూరు, లంకల గ్రామాలలో శ్రీకృష్ణ

జన్మాష్టమి సందర్భంగా ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామాలలో కృష్ణుని విగ్రహాన్ని ఊరేగించి, ఉట్టికొట్టే సందడి ఉల్లాసంగా సాగింది.

గౌతు లచ్చన్న పోరాట పటిమ భావితరాలకు ఆదర్శం

విశాలాంధ్ర - రాజమండ్రి : ప్రసిద్ధ స్వాతంత్య్ర సమరయోధుడు గౌతు లచ్చన్న పోరాట పటిమ మనకే కాదు, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం అని రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. శనివారం గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా కూటమి ఆధ్వర్యంలో అధికారికంగా స్థానిక వై జంక్షన్‌లోని గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత 'సర్దార్' అనే గౌరవ బిరుదు పొందిన ఏకైక తెలుగు నాయకుడు లచ్చన్న అని అన్నారు. గీత కులాలకు ఆరాధ్యదైవం గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం జరుగుతోందని, ఇది బీసీ జాతి బిడ్డలుగా మనందరికీ గర్వకారణమన్నారు. నివాళి అంటే జయంతి వర్ధంతి చేయడం ఒక్కటే కాదని వారి ఆశయాలను ఆచరణలో పెట్టాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ బీసీలకు అండగా ఉంటుందన్నారు. గతంలో బీసీల కోసం ఆదరణ పథకాన్ని అమలు చేసి బీసీలకు వారి వృత్తి పరమైన పని ముట్ల అందించడం జరిగిందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కూడా గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు సమాజానికి గౌతుల చిన్న చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘననివాళి

సర్దార్ గౌతు లచ్చన్న జయంతి పురస్కరించుకుని శనివారం స్థానిక వై జంక్షన్ వద్ద ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్దార్ గౌతు లచ్చన్న సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో నాయకులు రెడ్డి రాజు, మార్గాని చంటిబాబు, అన్నపూర్ణ రాజు, దుంగా సురేష్, మజ్జి అప్పారావు, పిల్లి నిర్మల తదితరులు ఉన్నారు.

సర్దార్ గౌతు లచ్చన ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - రాజమండ్రి : ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు యావత్ దేశం కొనియాడదగిన నేతల్లో సర్దార్ గౌతు లచ్చన్న ఒకరని మాజీ ఎంపీ , వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. సర్దార్ అనే బిరుదు దేశంలో అతి కొద్దిమందికే ఉందన్నారు. శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా స్థానిక వై జంక్షన్‌లోని గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్ పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ మాదిరిగా సర్దార్ గౌతులచ్చన్న సర్దార్ బిరుదు కలిగి ఉండడం తెలుగువారిగా మనందరికీ గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా చేపట్టడం అభినందనీయమన్నారు. గీతకులాలకు చెందిన వ్యక్తిగా గౌతు లచ్చన్న చేసిన కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. బీసీల అభ్యున్నతికి, గీత కులాల సంక్షేమానికి గౌతు లచ్చన్న చేసిన సేవలు మరువరానివన్నారు. ఆయన స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని, ఆవిధంగా తాము కృషి చేస్తామని భరత్ అన్నారు.

రైతుల సంక్షేమానికి సహకరించాలి

విశాలాంధ్ర- దేవరపల్లి : రైతుల సంక్షేమానికి మౌలిక సదుపాయాలు కల్పనకు సొసైటీ పాలకవర్గం పూర్తి సహకారం అందించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు సొసైటీ చైర్ పర్సన్ పర్సన్ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి శుక్రవారం సాయంత్రం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ పాలకవర్గ సభ్యులు సొసైటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా రైతులకు కావలసిన మౌలిక సదుపాయాలు ఎరువులు పురుగుమందులు సకాలంలో అందించాలన్నారు. గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సర కాలంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్‌గా కరుటూరి శ్రీరామ్మూర్తి, పర్సన్స్ కె రంగారావు, పి గంగరాజు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజులకు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ముళ్ళపూడి దొరాజి చౌదరి, కరుటూరి ధనంజయుడు, కొయ్యలమూడి తాతారావు, ముళ్ళపూడి సత్యనారాయణ, కంటిపూడి సుబ్బారావు సర్పంచ్ బొంత నాగమణి, కాండ్రు రామకృష్ణ, కాకర్ల హరిబాబు, కాకర్ల సృజన, బి సతీష్ పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర

విశాలాంధ్ర - రాజమండ్రి : స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పోలీసు సిబ్బంది ఎస్పి కార్యాలయం, దాని చుట్టు పక్కల ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ప్రతి నెల మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు, అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఎస్పి డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఎస్డీపీవో, సర్కిల్ ఆఫీసులు , పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టి, మొక్కలు నాటారు.

అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - నిడదవోలు : అనుమా నితుల పట్ల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని నిడద వోలు సర్కిల్ ఇన్స్పెక్టర్ పీవీజీ తిలక్, పట్టణ ఎస్ఐ జగన్ మోహన్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణ పోలీస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో నిడదవోలు నుండి పరిసర గ్రామాలకు వెళ్లే ఆటోలపై అనుమానిత వ్యక్తుల ఫోటోలతో సహా స్టిక్కర్లు అంటించారు. ఆటోలోను, బస్సులోను ప్రయాణిస్తున్న వ్యక్తులతో ఏమీ తెలియని వ్యక్తులుగా ప్రయాణం చేసి వారి విలువైన బంగారం, డబ్బులు, సెల్‌ఫోన్లు ఇతరత్రా విలువైన వస్తువులను దొంగతనం చేసే వారి పేర్లు ఫోటోలతో సహా స్టిక్కర్లు వేసి ఆటోలపై అంటించడంతో పాటుగా అనుమానితులను గుర్తించే విధంగా ఆటో డ్రైవర్లకు అవగాహన కలిగించారు. అనుమానం వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించవలసిందిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వి జి తిలక్, పట్టణ ఎస్సై జగన్ మోహన్‌రావు కోరారు.

మహిళాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజమండ్రి : మాటతప్పని మడమ తిప్పని ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబు అని టిడిపి సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినందుకు కృతజ్ఞతగా రాష్ట్ర టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి అలాగే నియోజకవర్గ మహిళల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వారి చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమాన్ని కోటిపల్లి బస్టాండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గోరంట్ల మాట్లాడుతూ ఉచిత బస్సు పథకంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఇచ్చారని, అలాగే చంద్రబాబు డ్వాక్రా గ్రూపుల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు తీసుకున్నారని, ఉచిత గ్యాస్ పథకం అమలు చేసారని, ఇపుడు ఉచిత బస్సు పథకం తెచ్చారని ఆయన వివరించారు. ఉచిత బస్సు పథకం వలన ఆటో డ్రైవర్లకు ఇబ్బంది ఏమీ ఉండదని ఆయన అన్నారు. ఈ విషయంలో రెచ్చగొట్టేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని గోరంట్ల సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, నిమ్మలపూడి గోవింద్, ఏ.ఎం.సి వైస్ చైర్మన్ బోడపాటి గోపి, గంగిన హనుమంతరావు, కురుకూరి కిషోర్, నున్న కృష్ణ, చిన్నమరెడ్డి ఈశ్వరుడు, డైరెక్టర్ మద్దా మణి, పిల్ల తనుజ, గంగిన జాహ్నవి, దండమూడి ప్రమీల మహిళలు పాల్గొన్నారు.

గొప్ప వ్యక్తి గౌతు లచ్చన్న

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (ఏ ఆర్) ఎల్. చెంచి రెడ్డి ఇతర పోలీసు అధికారులు గౌతు లచ్చన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డీఎస్పీ (ఏ ఆర్) రవి కుమార్ , ఇన్స్పెక్టర్ (ఎస్ బి) ఏ. శ్రీనివాసరావు , ఆర్ ఐ సంజీవ్ కుమార్ ఇతర పోలీసు అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం : గూడూరి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : జడ్పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆరోపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి ఇన్చార్జి కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికలను రద్దుచేసి మళ్లీ కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. పోలీసు అధికారులు, ఎలక్షన్ అధికారులు ప్రభుత్వంతో కుమ్మక్కై ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా చేశారని ఎన్నికలు రుజువు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి ధైర్యం ఉంటే.. తన నిజాయితీని నిరూపించు కోవాలనుకుంటే సీసీ ఫుటేజీలను, వెబ్ కాస్టింగ్ ను బయట పెట్టాలన్నారు.

రూ.20 వేలు డిపాజిట్ అందజేత

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, జేగురుపాడు జీవికె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పాఠశాలలో నాగిరెడ్డి గంగరాజు సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం రూ.80,000లు డిపాజిట్ చేసి, దానిమీద వచ్చే వడ్డీని ప్రతి సంవత్సరం ఫస్ట్, సెకండ్ వచ్చే విద్యార్థులకు ప్రైజ్ మనీగా ఇస్తున్నారు. స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా రూ.80,000లకు మరో రూ.20,000లు డిపాజిట్ చేయమని, నాగిరెడ్డి గంగరాజు సత్యవతి దంపతుల కుమారుడు నాగిరెడ్డి సూర్య రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు ఎం సురేష్‌కు అందజేశారు. ఇప్పటి నుండి లక్ష రూపాయలు డిపాజిట్ మీద వచ్చే వడ్డీని ప్రతి సంవత్సరం పదవ తరగతిలో ఫస్ట్ సెకండ్ వచ్చిన విద్యార్థులకు ప్రైజ్ మనీగా ఇవ్వడం జరుగుతుందని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, కర్రి చిన్నబాబు, వనమాలి వెంకట బాలాజీ, దుడే శివ సుబ్రహ్మణ్యం, రంకిరెడ్డి చిట్టయ్య, వనమాలి వెంకన్న, బోనం నాగేశ్వరరావు, కొంబాబత్తుల సూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ రాహిత్యంగా పనిచేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - గోపాలపురం : విధి నిర్వహణలో క్రమశిక్షణ రాహిత్యంగా పనిచేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ జే. సంధ్య హెచ్చరించారు. శనివారం మండలంలోని హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలను గుర్చి, ఉద్యోగులు సమయానికి డ్యూటీకి వచ్చి వారి విధులను సక్రమంగా నిర్వహించాలని హెచ్చరించారు. అన్నివేళలా డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను రోగులకు పూర్తిస్థాయిలో అందించి ప్రభుత్వ వైద్య సేవలు పేద ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. బయట నుండి వచ్చే పేషంట్ల సంఖ్యను పెంచాలని (ఓ పి) సిబ్బందికి సూచించారు. సాధ్యమైనంత మేరకు పిహెచ్సి స్థాయిలోనే పూర్తిస్థాయి వైద్యం అందించాలని, ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని అత్యవసరమైతే రిఫరల్ హాస్పటల్‌కి కేసులను పంపించాలని తెలియజేశారు.

పశు వైద్యుడికి రాష్ట్ర సేవా పురస్కారం

విశాలాంధ్ర - కడియం : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, పశు వైద్యాధికారి డాక్టర్ జె శ్రీ రామ్ రవి కిరణ్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవ పురస్కారం లభించింది. శుక్రవారం గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పురస్కార వేడుకల్లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు చేతులమీదుగా రవి కిరణ్ పురస్కారం అందుకున్నారు. లింగ నిర్ధారిత వీర్యం (పెయ్య దూడలు వీర్యం) గురించి రైతులలో అవగాహన కల్పించి, రైతులకు ఆర్థిక తోడ్పాటు కల్పించేందుకు కృషి చేసి నందుకు గాను రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవ పురస్కారం పొందారు. అలాగే తూర్పు గోదావరి జిల్లా ఉత్తమ సహాయ సంచాల కులుగా, కడియం ఏరియా వెటర్నరీ ఆసుపత్రి పశు వైద్యాధికారి డాక్టర్ రవివర్మకు పురస్కారం లభించింది. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి చేతుల మీదుగా రవివర్మ పురస్కారం అందుకున్నారు.

38 మంది ఆర్ఎంసి అధికారులు, ఉద్యోగులను అవార్డులు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజ మహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల విశిష్టత, పారిశు ధ్యంపై నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆర్ఎంసికి చెందిన 38 మంది ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతులమీదుగా అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో అడిషినల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ ఎం.సీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ ఎ.వినూత్న, మేనేజర్ అబ్దుల్ మాలిక్, సీఎంఎం రామలక్ష్మి, ఇతర ఆర్ఎంసి అధికారులు పాల్గొన్నారు

షటిల్ క్రీడలో విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర - సీతానగరం: షటిల్ క్రీడలో ప్రతిభ చూపిన ప్రభుత్వ విద్యార్థినీ. మండలంలో చినకొండేపూడి గ్రామ పంచాయితీ పరిధిలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న చిడిపి అక్షయ్ అనే విద్యార్థిని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో గొల్లలమామిడాడలో జరిగిన షటిల్ పోటీల్లో గెలుపొందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ గెలుపొందిన అక్షయ్ సెప్టెంబర్ 12,13,14 అనంతపూర్ జిల్లాలో జరిగే పోటీలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ విజయం సాధించిన విద్యార్థినికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి శ్రీ కాశీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత విశ్వేశ్వర పుత్ర శక్తి గణపతి ఆలయం వద్ద కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారుల కృష్ణుడు, గోపికల వేషధారణ విశేషంగా ఆకట్టు కున్నాయి. చిన్నారులు గ్రామంలో కృష్ణ సంకీర్తన చేసుకుంటూ ఉట్టిని ఊరేగించి వచ్చిన డబ్బులను పేద యాదవునికి అందచేసి ఉట్టిని కొట్టారు. అనంతరం వేషధారణలో విశేష ప్రతిభ కనబరచిన చిన్నారులకు చింతా లావణ్య కుమార్ సౌజన్యంతో బహుమతులను ఆలయ కమిటీ సభ్యులు చిన్నారులకు అందజేశారు.

ఘనంగా సర్దార్ గౌతులచ్చన్న జయంతి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : జిల్లా స్థాయి స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త డా. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శనివారం ఉదయం బొమ్మూరు కలెక్టరేట్‌లో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, తదితరులు సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ "1909 ఆగస్టు 16న శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో జన్మించిన డా. సర్దార్ గౌతు లచ్చన్న చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అనేక స్వాతంత్ర్య పోరాటాల్లో చురుకుగా పాల్గొని, బెర్హంపూర్, రాజమండ్రి జైళ్లలో కఠినమైన శిక్షలను అనుభవించారన్నారు. ఆయన జీవితాంతం వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసి, గాంధేయవాదిగా సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం ఎప్పటికీ నిలిచిపోతుందనీ, అటువంటి మహానుభావుడి జయంతి మనందరికీ స్ఫూర్తి, గర్వకారణమన్నారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి. శశాంక మాట్లాడుతూ 'వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి లచ్చన్న చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన త్యాగాలు నేటి తరానికి ఆదర్శమన్నారు. జిల్లా డి.ఆర్వో టి. సీతారామ మూర్తి మాట్లాడుతూ, 'సర్దార్ గౌతు లచ్చన్న జీవితం, కృషి మనందరికీ దిశానిర్దేశమని, ఆయన చూపిన మార్గంలో నడుస్తే సమానత్వ సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ బిసి సంక్షేమ అధికారులు ముత్యాల సుబ్బరాజు, టీవీ ప్రసాద్, వసతి గృహాల సంక్షేమ అధికారులు, కలెక్టరేట్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ను ఆదుకోవాలి

విశాలాంధ్ర -తాళ్లపూడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం లో భాగంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేయటం మంచిదే కానీ దీని కారణంగా పరోక్షం గా తమ ఆటో ల పై తీవ్ర ప్రభావం పడుతోందని, యువశక్తి ఆటో యూనియన్ అధ్యక్షులు రజని పేర్కొన్నారు. మహిళకు ఉచిత బస్ ప్రయాణం అమలు వల్ల తమ కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఆటో లను తెచ్చి ఉపాధి చూపింది టీడీపీ ప్రభుత్వం హయాం లోనే అని, నేడు కొత్త పథకం వల్ల తమ ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఇబ్బంది కల్గిస్తున్నది టీడీపీ ప్రభుత్వమే అన్నారు. తమ యూని యన్ లోనే దాదాపుగా 250 మందికి పైగానే సభ్యత్వాలు కలిగియుండి, 20 ఏళ్ల పై బడి కేవలం ఆటో ల వల్ల తమ జీవనం సాగిస్తున్న తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, యూనియన్ అధ్యక్షులు పేర్కొన్నారు. ఆర్టీసీ ఉచిత బస్ దెబ్బ ప్రత్యక్షం గా తమను ఇరకాటం లో పడవేస్తోందన్నారు. ప్రభుత్వం చిత్త శుద్ధి తో ఆలోచించి గత ప్రభుత్వం మాదిరిగానే ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఆటో వర్కర్స్‌కు జీవన భృతి ఇవ్వాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : స్త్రీ శక్తి పథకం అమలులో భాగంగా మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణాన్నికల్పించి, ఆటో వర్కర్స్ భవిష్యత్ ను సందిగ్ధంలో పడేశారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.కె. విశ్వేశ్వర రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు పథకం హర్షణీయమని, అయితే దీనివల్ల ఆటో వర్కర్స్ ఇబ్బంది పడతారన్నారు. గత జగన్ ప్రభుత్వం ఆటో కార్మికులకు పది వేల రూపాయలు ఇచ్చిందని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దానిని నిలిపి వేసిందన్నారు. అలాగే ఆటో కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని ,ఫిట్ నెస్ సర్టిఫికెట్ల విషయంలో కూడా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఉచిత బస్సు వల్ల ఆటోలు రోడ్డెక్కే ప్రసక్తిలేదన్నారు. రాజమండ్రిలో 8000 ఆటోలు ఉన్నాయని, ఈ ఉచిత బస్సు పథకం వల్ల ఆయా కుటుంబాలన్నీ ఇబ్బందుల్లో పడతాయన్నారు. అందువల్ల ఆటో డ్రైవర్లకు నెలకు10 వేల చొప్పున జీవన భృతి నివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.సెప్టెంబర్1వ తేదీ లోపల ఆటో డ్రైవర్ల విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే , సెప్టెంబర్ 1న కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్లతో మహా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు డా. రాజశేఖర్ వైసిపిని విడిచి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయనను శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆయనను జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు టి.కె. ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష కమిటీ కన్వీనర్ బలరామ్ నాయుడు, లింగ్విస్టిక్ సెల్ చైర్మన్ కిశోర్ జైన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బాబి, రూరల్ ఇన్ చార్జి టి.రామారావు, మైనారిటీ సెల్ కన్వీనర్ అలీ పాల్గొన్నారు. గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి పురస్కరించుకుని శనివారం స్థానిక వై జంక్షన్ వద్ద ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి టి.కె, పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష కమిటీ కన్వీనర్ బలరామ్ నాయుడు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

భక్తజనసంద్రంగా వాడపల్లి దివ్య క్షేత్రం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామికి నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ఆర్టీసీ అధికారులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వివిధ రాష్ట్రాల నుండి ప్రత్యేక బస్సులు నడిపారు. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింట్ పి రాంబాబు వర్మ, రాపాక శ్రీనివాస్, మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్), ఆలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

విశాలాంధ్ర - రాజమండ్రి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమితులైన సంస్థాగత నాయ కులు, కార్యకర్తలంతా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగనన్న సారథ్యంలో పార్టీ మళ్లీ అధికారంలోకి రానుందని, జగనన్న సీఎం కానున్నారని ప్రజలంతా జగనన్నను కోరుకుంటు న్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలని ప్రజలు గుర్తించారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులైన సీనియర్ నాయకులు దాసి వెంకట్రావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి నియోజకవర్గ సిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన గుత్తుల మురళీధర్ పదవులు అలంకరించిన తర్వాత తొలిసారిగా రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం తో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దాసి వెంకట్రావు గుత్తుల మురళీధర్ లను శాలువాతో పుష్ప గుచ్ఛం ఇచ్చి సత్కరించారు.

ఎంఈవోకు ఉత్తమ ప్రశంస పత్రం

విశాలాంధ్ర- దేవరపల్లి: దేవరపల్లి మండలం విద్యాశాఖ అధికారి ఎం తిరుమల దాసుకు ఉత్తమ ప్రశంస పత్రం రాజమహేంద్రవరంలో పురస్కారాన్ని రాష్ట్ర పర్యటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి చేతులమీదుగా అందుకున్నారు .ఉత్తమ సేవలు అందించినందుకు తనకు ఉత్తమ అవార్డు రావడం ఎంతో సంతోషదా యకంగా ఉందని ఎంఈఓ తిరుమల దాసు తెలిపారు. అదేవిధంగా దేవరపల్లి మండల విద్యాశాఖ కార్యాల యంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కొయ్య ప్రసన్నకుమార్‌కు జిల్లా అధికారిణి ఎస్ సుభాషిణి సమగ్ర శిక్ష ఎ.పి.సి వారి నుండి ఉత్తమ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి

విశాలాంధ్ర- దేవరపల్లి: దేవరపల్లి రాధా గోపీనాథ్ ఆల యంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు సుదర్శన హోమం అంగరంగ వైభవంగా జరిగింది. దేవరపల్లి రాధా గోపీనాథ్ ఆలయం వద్ద ఈనెల 8 నుంచి16 వరకు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం నగర సంకీర్తన సుదర్శన హోమం, లక్ష్మీ నరసింహ స్వామి హోమం, శ్రీకృష్ణ హోమం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉప్పలపాటి కళావతి మహిళా భక్తులు కమిటీ సభ్యులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు హోమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సాయి కృష్ణ రాధాగోపీనాథులకు పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయి కృష్ణ గోపాల్ సుదీక్ష శర్మ దీక్షిత్ నిర్వహించారు. ఈ హోమంలో పైడికొండల దుర్గాప్రసాద్, కవల సతీష్, వీర్ల పవన్, బి మహేష్, బి సూర్యప్రకాష్, సాయికుమార్, కోమల పాల్గొన్నారు. రాత్రి భజన కార్యక్రమాలు ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. దేవరపల్లి మండలంలో దేవరపల్లి బీసీ కాలనీ మండలంలో వైష్ణవ ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - పిఠాపురం : దేశంలో నిరుద్యోగం, ధరలు, అరాచకం పెరుగు పోయిందని, కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, రైతులకు గిట్టుబాటు ధర లేదు. యూరియా కొరత ఉన్న ఎరువులు కొరత ఉన్న పట్టింపు లేదు, స్మార్ట్ మీటర్లతో ఆదానికి ఆదాయం ప్రైవేటు కరణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు తాకాట పెట్టడం లాంటి చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని వీటి మీద భారత కమ్యూనిస్టు పార్టీ విస్తృతమైన పోరాటం చేస్తుందని ఆగస్టు 20 నుంచి 25 వరకు జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ ఒంగోలు మహాసభలు జయప్రదం చేయాలని కాకినాడ జిల్లా పిఠాపురం సీపీఐ కమిటీ సభ్యులు శనివారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు సాకారామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నక్క శ్రీనివాసరావు పాత్రికేయులతో మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భూమి కోసం, భుక్తి కోసం, విద్యా, వైద్యం ప్రజలకు సక్రమంగా అందే విధంగా సీపీఐ ఏళ్ల తరబడిపోరాటం చేస్తోందని భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావంచి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని ఒకపక్క 100 సంవత్సరాల శతదినోత్సవాలు మరోపక్క నియోజవర్గ జిల్లా రాష్ట్ర మహాసభలు ఘనంగా జరుపుకుంటుందని అన్నారు. ఈ సభలలో ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ దేశ సమగ్రతకు ఎంతో తోడ్పడుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ 150 దేశాల్లో ఎర్రజెండా పార్టీ రెపరెపా ఎగురుతుందని సిపిఐ పార్టీ విశిష్టతను కొనియాడారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల గురించి మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్లు నిలుపుదల చేయాలని భారీ ఎత్తున పోరాటం చేస్తుందని, గత ప్రభుత్వంలో పేదవారి ఇల్లు గురించి సేకరించిన ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని భారీ స్థాయిలో పోరాటం చేస్తోందని పోరాటాల్లో ముందుకు సాగిపోతున్న భారత కమ్యూనిస్టు పార్టీని బలపరచవలసిన అవసరం ప్రజలపై ఉందని ఈ మహాసభలకు కార్మికులు, కర్షకులు, ప్రజలు, ప్రజా సంఘాలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేపకాయలు ప్రసాద్, కేశపు అరుణ, కేసరి వీరబాబు, బత్తిన రాజు, వాసంశెట్టిరవణ తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - కొత్తపేట : సర్దార్ గౌతు లచ్చన్న దేశానికి అందించిన సేవలు మరువలేనివని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శనివారం వాడపాలెం లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బండారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో మారుమూల బారువ గ్రామంలో ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన గౌతు లచ్చన్న మన దేశ స్వాతంత్రం కోసం గాంధీజీ, పటేల్, ఆచార్య ఎన్జీరంగా వంటి నాయకులతో కలిసి ఎన్నో ప్రజా ఉద్యమాలు చేశారన్నారు. ఆంగ్లే యుల కాలంలో తనదైన పోరాటాలతో జైలు జీవితం సైతం అనుభవించి ఉక్కు మనిషిగా పేరు పొందారని గుర్తు చేశారు. కొత్తపేట నియోజక వర్గంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తనపై ఆయన అభిమా నం, వాత్సల్యం చూపేవా రని పాత రోజుల్ని గుర్తు చేసుకున్నారు. కంఠం శెట్టి శ్రీనివాస్, మిద్దె ఆదినారాయణ, గనిశెట్టి వీరేష్, బొక్క ప్రసాద్, బండారు రాజేష్, గుబ్బల మూర్తి, మెర్ల గోపాలం, కదలి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏపీజీఈఏ ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిన రోజు సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాలలో తాలూకా యూనిట్లలో మండలాలలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరఫున సంఘం గుర్తింపు కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సందర్భంలో ఈరోజు మన కొవ్వూరులో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సంఘానికి మద్దతు తెలియజేసి సంఘ అభివృద్ధి కొరకు ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నక్క వెంకటరత్నం కోరి ఉన్నారు ఈ కార్యక్రమంలో దాసరి మోహన్ సుంకవల్లి హరికృష్ణ మద్రి సుబ్రమణ్యం పోలిశెట్టి శివ మరియు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు

విశాలాంధ్ర - అమలాపురం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో భాగమైన 'స్త్రీ శక్తి' మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రారంభించిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఆర్డీవో మాధవి, రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని నిలబెట్టుకున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కొనియాడారు. సుపరిపాలనలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా సీఎం చంద్రబాబు పాటిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ముంపులోని పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర - గొల్లప్రోలు : పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వర్మ గొల్లప్రోలు పట్టణంలో సుద్దగడ్డ కొండకాలువ కింద ముంపుకు గురైన పంట పొలా లను శనివారం రైతులతో పాటు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ గొల్లప్రోలు పట్టణం, లక్ష్మీపురం, సీతారాంపురం, తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల్లో గల పొలాలల్లోకి ఇటీవల కురిసిన వర్షాలతో వరద నీరు రావడం జరిగింది. మరలా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ఈ ముంపుకు ముఖ్యకారకుడు జగన్మోహన్‌రెడ్డి అని, గొల్లప్రోలు పట్టణంలో దేవినగరం, కంకరరేవళ్ళు, శివాలయ మాన్యం, ఇబిసీ కాలనీ, ఎస్సీ కాలనీలు ముంపుకు గురికా కుండా ఉండడానికి తెలుగుదేశం పార్టీ ఎంతో పోరాడిందని, 2018లో సుద్దగడ్డ కొండకాలువ ఆధునీకరణకు సుమారుగా 160 కోట్లతో టెండర్లు పిలిచి, శంకుస్థాపన చేసి పనులు రమణక్కపేటలో ప్రారంభించామని గుర్తు చేశారు. 2014-19 మధ్య కాలంలో వరదలు వచ్చినపుడు స్వయంగా చంద్రబాబు వచ్చి పిఠాపురం రైతాంగానికి ఏలేరు ఫేస్ -2 ఇవ్వడం జరిగిందని, అంతేగాకుండా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కానీ జగన్ మోహన్‌రెడ్డి దానిని రద్దు చేయడం జరిగిందని, సంవత్సరాలు తరబడి పోరాడి తెచ్చిన దానిని ధ్వంసం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. సీటు త్యాగం సమయంలో కూడా తాను అడిగింది రైతాంగం కోసం పురుషోత్తపట్నం, ఏలేరు ఫేస్-2 ఆధునీకరణ అని వర్మ తెలిపారు. కూటమి రాగానే పురుషోత్తపట్నం ద్వారా గోదావరి జలాలకు నీరు అందించారని, రెండోది త్వరలోనే ఈ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ, శీరం మాణిక్యం, పార్టీ శ్రేణులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ బలోపేతానికి కృషి

విశాలాంధ్ర - అమలాపురం : భారత రిపబ్లికన్ పార్టీ జనరల్ బాడీ మీటింగ్ అమలాపురం సావరం రోడ్డులో గల రిపబ్లికన్ పార్టీ నాయకులు ఎన్ఎం రుషి ఇంటి వద్ద ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రిపబ్లిక్ ఆన్ పార్టీని బలోపేతం చేయడంతోపాటు గ్రామ గ్రామాణ విస్తరింప చేయడమే కాకుండా ప్రజలకు తెలియజేయుట, నూతన రాష్ట్ర ఎన్నికలు నిర్వహించారు. ఈ సమావేశంలో భారత రిపబ్లికన్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఅధ్యక్షుడిగా ఎన్ఎం రుషిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బల్ల సత్యనారాయణ, గిడ్డిజ్ఞాన ప్రసాద్, ప్రత్తిపాటి సుధాకర్‌రావు, ఎలిపే సోమరాజు, జనరల్ సెక్రెటరీలుగా కట్టా వేణుగోపాలకృష్ణ, దడాల రామకృష్ణ, మాదే బాల సత్యనారాయణ, గెద్దాడ సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీగా బదుగు సత్యనారాయణ, మోకా బాలయోగి, కోశాధికారిగా చీకరుమిల్లి చిరంజీవిలు ఎన్నికయ్యారు. ఎన్ఎం రుషి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అవలంబిస్తున్న విధానాలను, దళితులపై జరుగుతున్న ద్దాలకు, అదేవిధంగా ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని అయినా అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ చిరంజీవి, బల్ల సత్యనారాయణ, ఉచ్చుల సాల్మన్ రాజు, గిడ్డి జ్ఞాన ప్రకాష్, గిడ్డి ప్రసాద్, జనుపల్లి చిన్న, పంతగంటి నరసింహమూర్తి, చీకరుమల్లి శ్రీనివాస్, తరపట్ల వెంకటేశ్వరరావు, మోకా కృష్ణమూర్తి, కలకట రమణ పాల్గొన్నారు.

కండక్టర్‌గా ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - రావులపాలెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు పథకం రావులపాలెంలో ప్రారంభం సందర్భంగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే బండారు రావులపాలెం నుంచి ముక్కామల వరకూ బస్సులో ఆర్డీవో శ్రీకర్‌తో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కండక్టర్ అవతారం ఎత్తారు. ముందుగా తాను టిక్కెట్టు కొనుక్కుని తర్వాత బస్సులో ప్రయాణిస్తున్న ప్రతి మహిళకు స్త్రీ శక్తి జీరో టికెట్ తానే స్వయంగా అందజేశారు. మహిళలతో ఉచిత బస్సు పథకం యొక్క ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వద్ద ఉచిత బస్సు పథకంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావులకు మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కెవి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, కేతా శ్రీను, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, బూసి జయలక్ష్మి భాస్కరరావు, కాసా సాగర్, యల్లమెల్లి జగన్మోహన్, గనిశెట్టి వీరేష్, కొప్పిశెట్టి ప్రసాద్, కొవ్వూరు అచ్చిరెడ్డి మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సై అవినాష్‌కు ప్రశంసా పత్రం

విశాలాంధ్ర - కాట్రేనికోన : విధి నిర్వహణలో విశిష్ట సేవలకు గుర్తింపుగా కాట్రేనికోన పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ అవినాష్‌కు స్వాతంత్ర దినోత్సవ పురస్కారం లభించింది. అమలాపురంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ వావిరాల మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ బి కృష్ణారావు చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

విశాలాంధ్ర - పెదపూడి : ఇంటిని, పరిసరా లను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు అనేది ప్రతి ఒక్కరూ చెప్పేదే. చెప్పడం సులభం, చేయడం కష్టం అనేది నగ్నసత్యం. కానీ అక్షరాల తాను పని చేయడమే కాకుండా సిబ్బందితో పని చేయించి చూపిస్తున్న అధికారి పెదపూడి మండల డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి. డిప్యూటీ ఎంపీడీవో ఒకపక్క ఆఫీసులో విధులు నిర్వహిస్తూనే రోజుకో గ్రామంలో ఉదయాన్నే పర్యటిస్తూ పొడి, తడి చెత్త వేర్వేరుగా సేకరించే విధంగా చర్యలు చేపట్టడమే కాకుండా దగ్గరుండి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందో లేదో పర్యవేక్షించడం పట్ల ఆయన పని తీరును ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రశంసిస్తున్నారు. అలుపెరగకుండా ప్రజా సంక్షేమ మే ధ్యేయంగా శనివారం డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ మండలంలోని పెద్దాడ పంచాయతీలో పొడిచెత్త సేకరించి షెడ్డుకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా పెదపూడి పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్‌లో తవ్వించిన కచ్చా డ్రైన్ సిల్క్ ట్రాక్టర్‌పై తరలించే విధంగా డిప్యూటీ ఎంపీడీవో తక్షణమే తగిన చర్యలు చేపట్టడం విశేషం.

పాఠశాలకు టీవీ వితరణ

విశాలాంధ్ర - మామిడికుదురు : ఈదరాడ గ్రామంలోని సిద్ధార్థపేట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకి వ్యవసాయ శాఖలో అడిషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ముంగండ సత్యనారాయణ టీవీ బహుకరించారు. తమ అత్తమామలైన కుసుమ వెంకట్రావు, లక్ష్మీకాంతంల జ్ఞాపకార్థం పాఠశాలకు స్మార్ట్ టీవీని బహుకరిం చారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మీ రమేష్ చేతుల మీదుగా ప్రధానోపా ధ్యాయులు శ్రీరామకృష్ణకు అందించారు. ముంగండ సత్యనారాయణను పలువురు కొనియా డారు. ఎస్ఎంసి చైర్మన్ కుసుమ ప్రసాద్, గోసంగి సత్య సునేత్ర, బత్తుల నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుక

విశాలాంధ్ర - మామిడికుదురు : స్థానిక దీప్తి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అందరిని అలరించారు. చిన్ని కృష్ణులచే ఉట్టి కొట్టించడం, గోపికల కోలాటం, ఆట పాటలు అందరిని ఆకట్టుకు న్నాయి. దీప్తి కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు యక్కలదేవర నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ఏలూరు జిల్లా సమస్యలు పరిష్కరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో ఆయన నివాసంలో కలిశారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి పలు విషయాలపై చర్చించారు. వేలేరుపాడులో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, నూజివీడు ఐఐఐటికి రూ.12.17 కోట్లు, ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.12.60 కోట్లు, ఏలూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థకు కొత్త భవనం నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరు చేయాలని ఎంపీ కోరారు. అంతేగాకుండా వెనుకబడ్డ గిరిజన ప్రాంతమైన కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఒక ఫైర్ స్టేషన్ కమాండూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రి నారా లోకేష్ ను కోరారు. వీటితో పాటు మరికొన్ని అంశాలను కూడా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సీఎంఆర్ఎఫ్ నిధుల విడుదలలో అలస్యం, పామాయిల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ, కోకో రైతుల సమస్య, సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి కొల్లేరు రిపోర్ట్ అందించుట, పెండింగ్‌లో ఉన్న సత్యసాయి స్కీమ్ వర్కర్ల జీతాలు, వంటి మరికొన్ని విషయాలను మంత్రి లోకేష్ దృష్టికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తీసుకెళ్లారు. యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని ఎంపీ పుట్టా మహేష్‌కు మంత్రి లోకేష్ బహుకరించారు. విషయాలను వివరంగా అడిగి తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని, వీలైనంత త్వరలో అన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీ పుట్టా మహేష్ తెలిపారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్ డిపో సందర్శన

విశాలాంధ్ర - నరసాపురం: స్థానిక ఆర్టీసీ బస్సు డిపోను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఏస్ మునిరత్నం, రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ రాజశేఖర్, నరసాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు సందర్శించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌తో సమావేశమై బస్సుల నిర్వహణ, సిబ్బంది పరిస్థితులు, ప్రయాణికుల సౌకర్యాలపై సమీక్షించారు. అనంతరం ప్రయాణికులతో ప్రత్యక్షంగా మాట్లాడి, ఇటీవల ప్రారంభించిన 'స్త్రీశక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం' గురించి అడిగి తెలుసుకొని, ఆ పథకం ద్వారా లభిస్తున్న లాభాలు ప్రజలుకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, కౌన్సిలర్ పాలూరి నరసింహారావు (బాబ్జీ), షేక్ హుస్సేన్, వైదాని నాగేశ్వరరావు,నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలని యువత ధర్నా

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని ఏజెన్సీ ప్రధాన రహదారి ఏళ్లు గడిచిన మరమ్మతులకు నోచుకోక పోవడంతో సుమారు ఐదు గ్రామాల యువకులు రమణయ్యపేట ప్రధాన కేంద్రంగా రోడ్డెక్కారు. ఏలేశ్వరం నుంచి ఏజెన్సీ ప్రధాన రహదారి సుమారు 15 కిలోమీటర్ల మేర ధ్వంసమై ఏళ్లు గడిచిన మరమ్మతులకు నోచుకోకపోవడంతో యువకులు రోడ్డు ఎక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 20 గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు ఆధారమని, దీంతో ఏలేశ్వరం నుంచి అడ్డతీగల వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు వెంటనే పునర్నిర్మించాలంటూ ధర్నా నిర్వహించారు. 20 సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు మారుతున్న తమ గ్రామాలకు రోడ్డు వేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే రహదారిపై గర్భిణీ స్త్రీలకు పురిటి నొప్పులు వస్తే అంబులెన్స్‌కు ఫోన్‌చేస్తే రోడ్డు అధ్వానంగా ఉండడంతో అంబులెన్సు రావడం లేదని వారు వాపోయారు. ఎన్నిసార్లు ఆందోళనలు చేపట్టిన అధికారులు పట్టించుకోవడం లేదని అధికారులపై మండిపడ్డారు. రోడ్డు వేస్తారా లేకుంటే చెక్ పోస్టు పెట్టి చందాలు వసూలు చేసుకుని మాకు మేమే రోడ్డు నిర్మించుకోమంటారా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రావాలంటూ నినాదాలు చేశారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధర్నా స్థలానికి పోలీసు వారు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఆందోళనకారులు పోలీస్ వారి మధ్య చర్చలు తాత్కాలికంగా సఫలం అవడంతో వారు రోడ్డుపై నిర్వహించిన ధర్నాను విరమింప చేశారు.

ఆటోనగర్ అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర ఏలూరు: ఆటోనగర్ అభివృద్ధికి సహకరించాలని ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరుణతార నాగేశ్వరరావు, కార్యదర్శి అడపా సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ రి.నం.83/1982, ఏలూరు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆటోనగర్, బి.బిట్ కాంప్లెక్స్ పైన అధ్యక్షులు అరుణతార నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశంను ఉద్దేశించి అధ్యక్షులు అరుణతార నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పడి దశాబ్ద కాలం పైబడిన రోడ్లు, డ్రైనేజీ,వీధి దీపాలు, వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు నగరం నుంచి పది సంవత్సరాల క్రితం మెకానిక్ షెడ్లన్నీ ఆటోనగర్‌కు తరలివచ్చి ఇక్కడ యూనిట్లు ఏర్పాటు చేసుకున్న ఆటోమొబైల్ వృత్తిదారులకు 2017లో విధించిన రిజంప్షన్ వలన లోన్లు రాక పంచాయతీ నుండి అనుమతులు ఇవ్వక కనీస విద్యుత్తు సదుపాయం లేక మిగిలిన వారు యూనిట్లు ఏర్పాటు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ అధ్యక్షులు మాగంటి నాగభూషణం కోట్లాది రూపాయల అసోసియేషన్ సొమ్మును దుర్వినియోగం చేసి నేటికీ లెక్క జమలు చెప్పకుండా కాలం గడుపుకుంటూ ప్రస్తుత కమిటీ ఎన్ని లేఖలు పంపిన సమాధానం చెప్పకుండా కోర్టులలో కేసులు వేస్తూ కాలం వెళ్లదీస్తూ ఆటోమొబైల్ వృత్తిదారులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఆటోమొబైల్ వృత్తిదారులు పడుతున్న సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి ఎపిఐఐసి వారు ఇచ్చిన రిజంప్షన్ ఉత్తర్వులను రద్దుచేసి ఆటో నగర్ అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అ సోసియేషన్ కార్యదర్శి అడపా సత్యనారాయణ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధి కొరకు ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ జమా ఖర్చులను సర్వసభ్య సమావేశం చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో రూపొందించుకున్న భవిష్యత్తు కార్యాచరణ అమలుకు కార్యవర్గం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని తెలియజేశారు. ఉపాధ్యక్షులు కర్రి ఈశ్వరరావు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం సజావుగా సాగడానికి సహకరించిన సభ్యులకు బందోబస్తు కల్పించిన ఏలూరు రూరల్ పోలీసు వారికి, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు మహమ్మద్ సులేమాన్, కమిటీ సభ్యులు సిగిరెడ్డి సంజీవరావు, బోడ రాజు, గుమ్మల్ల సూర్యనారాయణ, షేక్ జుల్ఫీ,సయ్యద్ చోటే, బుస్సే ప్రతాప్, గంటా జోగిరాజు, లారీ మెకానిక్ బాబు, శెట్టి వెంకటేశ్వరరావు, సయ్యద్ జానీ, ఉప్పులూరి హేమ శంకర్, మరకాల మురళి, పల్నాటి సతీష్, వెన్నమనేని గంగాధర్ రావు, అర్జా వెనర్జీ,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుక

విశాలాంధ్ర - అమలాపురం : రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో శనివారం జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. మంత్రి సుభాష్ రాకతో ఆ గ్రామంలో సందడితోపాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో మంత్రి సుభాష్ ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. పిల్లలు, గ్రామ ప్రజలు, యువకులు, కూటమి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉట్టుకొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఎంతో ఇష్టమైన కృష్ణాష్టమి పండుగ ఘనంగా నిర్వహించడం ఆనందకరమన్నారు. అప్పట్లో శ్రీకృష్ణుని అల్లరి తట్టుకోలేక పాలు,పెరుగు ఉట్టిలో పెట్టి చేతికి అందకుండా పైన దాచుకునేవారని, అయినా సరే తన స్నేహితులతో వెళ్లి పాలు, పెరుగు దొంగిలించి తినేవాడని, అందుకే ఉట్టి బాగా ప్రాశస్త్యం పొందింది అన్నారు. ప్రజలంతా ఆనందంగా, సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. పిల్లల ధరించిన శాస్త్రీయ దుస్తులు, శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు కనుల విందుగా ఉన్నాయని అన్నారు. అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో...

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ చైర్ పర్సన్ దూడల విరీతాదేవి ఫణిల ఆర్థిక సహాయంతో పిరమిడ్ స్పిరుచవల్ సొసైటీ సభ్యులచే ఏర్పాటు చేసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.తల్లిదండ్రులు తమ చిన్నారులకు రాధా, కృష్ణుల వేషాలు వేయించి తీసుకుని వచ్చారు. చిన్నారులకు రాధా, కృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహించారు. అనంతరం ఉట్టిని కొట్టారు. ఈ కార్యక్రమంలో దూడల విరీతాదేవి, దూడలఫణి, కొవ్వూరి గాయత్రీ, యెండూరి సీత, పప్పోప్పుల ఇందిర పాల్గొన్నారు.

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎంపీ సానా

విశాలాంధ్ర - కాకినాడ : క్రికెటర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబుకి మరోసారి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ACA) కార్యదర్శి బాధ్యతలు నేడు ఏకగ్రీవంగా అప్పగించబడ్డాయి. వరుసగా రెండోసారి ఈ పదవిలో కొనసాగుతూ రాబోయే మూడేళ్లపాటు ఆయన నాయకత్వం వహించనున్నారు. మొదటి టర్మ్‌లోనే ఆయన చేసిన కృషి విశేషమైంది. మహిళా క్రికెట్‌కి ప్రోత్సాహం, గ్రామీణ ప్రతిభావంతులను గుర్తించి APL వరకు తీసుకురావడం, విశాఖ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు తీర్చిదిద్దడం, అంతర్జాతీయ మ్యాచ్‌లను ఆ వేదికకు తీసుకురావడం వంటి విజయాలు ఆయన నాయకత్వానికి నిదర్శనాలు. ఈ కృషికి బీసీసీఐ నుంచి ప్రశంసలు లభించాయి. కార్యదర్శి జయ్ షా ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో, అమరావతి స్టేడియం నిర్మాణంపై ఆయన చేస్తున్న కృషి రాష్ట్ర క్రికెటర్లలో కొత్త ఆశలు నింపింది. ఈ నేపథ్యంలో జరిగిన తాజా ఎన్నికల్లో సానా సతీష్ బాబు విజయం సునాయాసమని అందరూ భావించినట్టుగానే, ఆయన ఏకగ్రీవంగా మరోసారి కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర కొవ్వూరు : కొవ్వూరు మండలం కుమారదేవం ఏటిగట్టు వద్ద గెస్ట్‌హౌస్‌లో పనిచేస్తున్న బొక్కా రత్న రాజు (48) విద్యుత్ షాక్‌తో మృతి. ఈ గెస్ట్ హౌస్‌కు ఇరిగేషన్ శాఖ తరపున ఎటువంటి అనుమతులు లేవని తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపారు.

వయ్యారిభామ మొక్కలపై అవగాహన

విశాలాంధ్ర - రాజానగరం : కలుపు జాతికి చెందిన వయ్యారిభామ మొక్కలతో అనర్థాలెన్నో ఉన్నాయని కృషి విజ్ఞాన కేంద్రం(కెవికె) హెడ్ డాక్టర్ వి.ఎస్.జి.ఆర్. నాయుడు అన్నారు. కలుపు జాతి మొక్కలు నివారణపై సిటిఆర్ఐ మరియు కెవికె సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కలవచర్ల గ్రామంలోనీ కెవికె కేంద్రంలో వారం రోజుల పాటు జరగనున్న అవగాహన సదస్సులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.సదస్సు కి అధ్యక్షత వహించిన కెవికె ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విఎస్జిఆర్ నాయుడు మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏట ఆగస్టు 16 నుండి 22వ వరకు దేశవ్యాప్తంగా వయ్యారిభామ కలుపుపై అవగాహనా వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్ర కలుపు పేర్లతో పిలిచే ఈ వయ్యారిభామ మొక్కలతో అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్కగా వర్ణించారు. ఈ మొక్క నుండి వెలువడే కొన్ని రకాల రసాయనాలతో సమీపంలోని ప్రధాన పంటలోని మొక్కల పెరుగుదల నశించిపోతుందన్నారు. వయ్యారిభామ నివారణకు మొక్క పూత దశకు రాకముందే వేళ్లతో సహా పీకి తగల బెట్టాలన్నారు. కాలిప్రదేశాల్లో ఉన్న కలుపు మొక్కలు పూత దశకు రాకమునుపే 10 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలని తద్వారా వయ్యారి భామ కలుపు మొక్కలు మొలవవు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే సిబ్బంది ఎన్ వి.రఘునందన్, బి.నాగేశ్వర్ రెడ్డి, సంజయ్ హెగ్డే, విజయవర్ధన్, మరియు విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలకు చెందిన వ్యవసాయ విద్యార్థినులు పాల్గొన్నారు.